


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ ఆదివారం 30-06-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 170 పేజీలు : 4 వెల : రూ 2-00

## డీఎస్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం

హైదరాబాద్,మాజీ మంత్రి,ఏపీ పిసిసి మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ అకాల మరణంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి గా ,పిసిసి చీఫ్ గా చేసిన సేవలను మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం పార్టీలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. డిఎస్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు మరింత ధైర్యాన్ని ఇవ్వాలని ఆ దేవుడిని ప్రార్థించారు.

# కాంగ్రెస్ అభివృద్ధిలో కీలక భూమిక

### రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసిన నేత
### డిఎస్ మృతికి సిఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్,జూన్29: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పనిచేసిన డీఎస్.. కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారన్నారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని గుర్తుచేసుకున్నారు. డీ శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని తెలుగు రాష్ట్రాల్లో విస్తరింప జేసిన కీలక నేతల్లో డీ.శ్రీనివాస్ ఒకరని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. డీఎస్ మృతి పట్ల

వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. పీసీసీ అధ్యక్షుడిగా డీఎస్ సేవలు గుర్తు చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్?, వారి కుటుంబసభ్యులకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పని చేసిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని అభిప్రాయపడ్డారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డీఎస్ మృతిపట్ల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. డీఎస్ పార్థివదేహానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి డి.శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, డీఎస్ గొప్ప నాయకునిగా ఎదిగారని కొనియాడారు. సామాన్య స్థాయి నుంచి పీసీసీ అధ్యక్షుడు, మంత్రిగా పని చేసే స్థాయికి ఆయన ఎదిగారని గుర్తు చేశారు. డీఎస్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్టిస్తున్నట్లు సుఖేందర్ రెడ్డి తెలిపారు. సీనియర్ నేత, మాజీ మంత్రి డీ.శ్రీనివాస్ మృతిపట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విచారం వ్యక్తంచేశారు. వారి సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితమయ్యారని చెప్పారు. 2004-2009లో అసెంబ్లీలో వారందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాని, బీజేపీ ఎంపీ అరవింద్, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆదివారం ఉయదం నిజామబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత డిఎస్ కన్నుమూత

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
### నిజామాబాద్‌కు భౌతిక కాయం తరలింపు
### నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



హైదరాబాద్,జూన్29(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్.. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు తుదిశ్వాస విడిచారు.దీంతో బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన స్వగృహానికి భౌతికకాయాన్ని తరలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నిజామాబాద్ పట్టణానికి తరలిస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సొంత నియోజకవర్గమైన ఇందూరు పట్టణంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులు కూడా వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం డీఎస్ భౌతిక కాయాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం నిజామాబాద్‌కు తరలించున్నారు. డీఎస్ మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఎస్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బిఆర్ఎస్ నేత కెటిఆర్, తదితరులు డిఎస్ ఇంటికి వెల్లి నివాళి అర్పించారు.

# బీహార్‌కు ప్రత్యేకహోదా ఇవ్వండి

### జెడియూ సమావేశంలో నేతల డిమాండ్



పట్నా,జూన్29: ఏపీలో అత్యధిక ఎంపీ సీట్లు సాధించిన టీడీపీ, ఇటు బిహార్‌లో గణనీయ సంఖ్యలో ఎంపీ స్థానాలు గెలుచుకున్న జేడీయూ సాయంతో మూడోసారి ఎన్డీయే పగ్గాలు చేపట్టింది. దీంతో ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రధాని మోదీ ముందు పెద్ద కోరికలే కోరే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చలు జరిగాయి. వీటిని నిజం చేస్తూ నితీశ్ కుమార్.. మోదీ ముందు భారీ డిమాండ్ ఉంచారు. అదే ప్రత్యేక హోదా. ఏపీలాగే ఎన్నో ఏళ్ల నుంచి బిహార్ కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేక హోదా అడుగుతోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో తాము కీలకంగా ఉన్నామని భావిస్తున్న జేడీయూ ఇదే అదనుగా భావిస్తూ ప్రత్యేక హోదా అంశాన్ని మళ్లీ తెరపైకి తెస్తోంది. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) డిమాండ్ చేసింది. హోదా లేకుంటే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని కోరింది. ఎన్డీయేలో భాగస్వామ్యంగా ఉన్న ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. తీర్మానంలో రాష్ట్రం ఆర్థికంగా, అభివృద్ధిలో వెనుకబడి ఉండటాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరమని, దీర్ఘకాలంగా ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతోపాటు ఈ మధ్యే రిజర్వేషన్లను 65 శాతానికి పెంచిన కోటాను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. న్యాయ పరిశీలన, రక్షణ కోసం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ కోటాను చేర్చాలని జేడీయూ ప్రతిపాదించింది. అలాగే ఈ కోటాను నిరంతరాయంగా అమలు చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. ఇదే సమావేశంలో ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం సంజయ్ ఝాను నియమించారు. నితీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కోర్ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇవాళ జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో రెండు ముఖ్యమైన ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. అవి ఒకటి సంజయ్ ఝా నియామకం. రెండు జేడీయూ.. ఎన్డీయే కూటమిలోనే కొనసాగడం. ఈ నిర్ణయాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.

# రాజకీయాలకు అతీతమైన వ్యక్తి డిఎస్

### భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన వెంకయ్య
### కాంగ్రెస్ కండువా కప్పి నివాళి అర్పించిన మంత్రులు







హైదరాబాద్,జూన్29: డీఎస్ రాజకీయాలకు అతీతమైన వ్యక్తి అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. డీఎస్ పార్థివ దేహానికి ఆయన నివాళి అర్పించారు. మిత్రులు డి. శ్రీనివాస్ మృతి చెందారని తెలిసి చాలా బాధపడ్డానన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకుడిని ప్రజలు కోల్పోయారనినారు. ఆనాటి రాజకీయ నేతల్లో మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి డీఎస్ అని అన్నారు. ఏ మాత్రం గర్వం లేకుండా అందర్నీ కలుపుకుపోయేవారన్నారు. డీఎస్ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందన్న వెంకయ్యనాయుడు.. డీఎస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాడ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం ఆయన భౌతికకాయాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లో ఉంచారు. ప్రస్తుతం ఆయనను చూసేందుకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివస్తున్నారు. సాయంత్రం ఆయన భౌతికకాయాన్ని నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి తరలించనున్నట్లు సమాచారం. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అయితే.. డి.శ్రీనివాస్ మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. టీపీసీసీ తరుపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు నివాళులు అర్పించారు. డీఎస్ పార్థీవదేహంపైన కాంగ్రెస్ పార్టీ జెండా కప్పిన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబులు నివాళులు అర్పించారు. నిజామాబాద్ కు డీఎస్ పార్థివదేహం తరలించనున్నట్లు సమాచారం. శ్రీనివాస్ 1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్ జిల్లాలో జన్మించాడు. నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున రంగంలోకి దిగి నిజామాబాద్ అర్బన్ నుంచి తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తర్వాత 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచి.. 1998లో ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. డీఎస్ అంత్యక్రియలు రేపు నిజామాబాద్‌లో అధికారిక లాంఛనాలతో జరపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు. డీఎస్ పార్థివ దేహాన్ని ఇవాళ సాయంత్రం నిజామాబాద్ లోని స్వగ్రామానికి తరలించనున్నారు.

# వరంగల్‌ను మరో హైదరాబాద్ చేస్తా.. రేవంత్ కీలక వ్యాఖ్యలు

హనుమకొండ: హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక హామీ ఇచ్చారు. ఈరోజు (శనివారం) వరంగల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి




చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ 2050ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు కనెక్ట్ అయ్యేలా ఉండాలని సూచించారు. రింగ్ రోడ్డు నుంచి టెక్స్‌టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలని సూచించారు.స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.వరంగల్ నగర అభివృద్ధిపై ఇక నుంచి ప్రతీ 20 రోజులకోసారి ఇన్‌చార్జ్ మంత్రి సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ తెలిపారు.

# కొండగట్టును దర్శించుకున్న పవన్ కళ్యాణ్

### ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటీ సిఎం
### దారిపొడవునా అభిమానుల నీరాజనాలు

కొండగట్టు,జూన్29: ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో స్థానికులు ఆలయానికి తరలివచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరిన పవన్‌కు..



మార్గమధ్యలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. తుర్కపల్లి క్రాస్ రోడ్స్ వద్ద జనసేన నాయకులు గజమాలతో ఆయనను సత్కరించారు. పవన్ రాక నేపథ్యంలో.. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రోడ్డుమార్గంలో శనివారం ఉదయం ఆయన కొండగట్టుకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయనకు దారి పొడవునా అభిమానులు ఘనస్వాగతం పలికారు. ముందుగా హైదరాబాద్ శివారులోని తుర్కపల్లిలో పవన్ కల్యాణ్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. తుర్కపల్లి నుంచి బయల్దేరిన తర్వాత సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి వద్ద కూడా జనసేన అధినేతకు ఘన స్వాగతం లభించింది. అక్కడ పవన్ కల్యాణ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిమానులు అందించిన వీరఖడ్గంతో ఆయన ఫొటోలకు పోజులిచ్చారు. అనంతరం అభిమానులకు అభివాదం చేసుకుంటూ కొండగట్టుకు బయల్దేరి వచ్చారు. ఏపీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంతో పవన్ కల్యాణ్ వారాహి అమ్మవారి దీక్షను చేపట్టారు. 11 రోజుల పాటు నిష్టతో ఈ దీక్షను పాటించనున్నారు. ఈ క్రమంలోనే తమ ఇలవేల్పు అయిన కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, గత ఏడాది ఎన్నికలకు ముందు ప్రచారం మొదలుపెట్టిన పవన్ కల్యాణ్.. తన వారాహి ప్రచార రథానికి కొండగట్టులోనే ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారాహి విజయయాత్రను నిర్వహించారు.

# నీట్ ఎత్తేయండి.. ప్రధాని మోదీ, 8 మంది సీఎంలకు స్టాలిన్ లేఖ

చెన్నై: వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష (నీట్) విధానాన్ని ఎత్తేయాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, రాహుల్ గాంధీతోపాటు ఎనిమిది రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖలు రాశారు. అలాగే నీట్ (ఔఇఖ ) నుంచి తమిళనాడును మినహాయించాలని పునరుద్ఘాటించారు. వృత్తిపరమైన కోర్సుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా కాకుండా 12 వ తరగతి మార్కుల ద్వారా మాత్రమే ఉండాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు. నీట్ అనేది విద్యార్థులపై అనవసరమైన అదనపు ఒత్తిడి అని ఆరోపించారు.కాగా, ఇటీవల నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు తమిళనాడు వ్యతిరేకతను సమర్థిస్తున్నదని స్టాలిన్ తెలిపారు. 'ఈ ఎంపిక ప్రక్రియను తొలగించాల్సిన అవసరంపై ఇతర రాష్ట్రాలు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి' అని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని, 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్ల కోసం అసెంబ్లీలో ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించినట్లు సీఎం స్టాలిన్ తెలిపారు. రాష్ట్రపతి ఆమోదం కోసం ఈ బిల్లును పంపామని, ఇది పెండింగ్‌లో ఉందన్నారు.మరోవైపు నీట్ రద్దు కోసం అసెంబ్లీలలో ఇదే విధమైన తీర్మానాన్ని ఆమోదించడాన్ని పరిశీలించాలని ఎనిమిది రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ సూచించారు.

# సంపాదకీయం

ఆదివారం 30-06-2024

## నీట్ ఆన్ లైన్ సాధ్యం కాదా...

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అనంతర పరిణామాలపై చర్చ జరుగుతోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 2010 డిసెంబర్ 21న నాటి యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెస్ట్ టెస్ట్ (కామన్ ఎంట్రెస్ట్ టెస్ట్)ను నిర్వహించాలని నిర్ణయించింది. కాగా, అనేక కారణాలు చూపుతూ మోదీ పాలనలో ఉన్న గుజరాత్ మొదలు అనేక రాష్ట్రాలు అప్పట్లో దీనిని తిరస్కరించాయి. తర్వాత.. 2013 నుంచి 2016 మధ్యకాలంలో నీట్ పరీక్షా విధానం లోపభూయిష్టంగా ఉందని, ఇది కొన్ని భాషల, ప్రాంతాల విద్యార్థులకు నష్టం కలిగిస్తోందంటూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అయితే, దేశవాప్తంగా ఒకే పరీక్ష వలన అన్ని ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు వచ్చే అవకాశం ఉందని, 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తున్నందున అన్యాయం జరిగే అవకాశం లేదంటూ దేశంలోని రాష్ట్రాలన్నీ 'నీట్'లో జాయిన్ కావాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా 'ఆల్ ఇండియా పూల్' ద్వారా తెలంగాణ విద్యార్థులకు ఎంతోకొంత మేలు జరుగుందని అప్పట్లో అందరూ భావించారు.అయితే, నీట్ పరీక్ష వల్ల మొత్తంగా తెలంగాణకు లాభం కంటే నష్టమే ఎక్కువగా జరిగిందని గత ఆరేళ్ల అనుభవాలను బట్టి అర్థమవుతోంది. 2017 నుంచి తెలంగాణ విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణ నుంచి ఈ పరీక్షకు 1.4 లక్షలమంది విద్యార్థులు హాజరయ్యారు. తెలంగాణలో 54 మెడికల్ కాలేజీలుండగా, అందులో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 27. రాష్ట్రంలోని మొత్తం మెడికల్ సీట్ల సంఖ్య 8,265 కాగా, అందులో ప్రభుత్వ కాలేజీల్లో ఉన్న సీట్లు 3,815 మాత్రమే. అయితే వీటిలో 15 శాతం సీట్లు.. 'ఆల్ ఇండియా పూల్' కోటా కింద ఇతర రాష్ట్రాల విద్యార్థులకు పోతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 30 పీజీ వైద్య కళాశాలుండగా అందులో ప్రభుత్వ కళాశాలల సంఖ్య 10 మాత్రమే. మొత్తం కళాశాలల్లో 2,978 సీట్లుండగా, ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లు 1,267 మాత్రమే. వీటిలో సగం సీట్లను 'ఆల్ ఇండియా పూల్' కోటా కింద తెలంగాణ విద్యార్థులు కోల్పోతున్నారు. అయితే, ఇక్కడి సీట్లు వేరే రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించినట్లే, వేరే రాష్ట్రాల సీట్లు ఆల్ ఇండియా పూల్ కింద ఉంటున్న సీట్ల వల్ల తెలంగాణ విద్యార్థులకు మేలు జరగటం లేదు. ఎందుకంటే తెలంగాణలోని కాలేజీల్లోని మెరుగైన సౌకర్యాల వల్ల బయటి రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడి కాలేజీల్లో టక్కున చేరిపోతుండగా, కనీస సౌకర్యాలు లేని బయటి రాష్ట్రాల మెడికల్ కళాశాలలో సీటొచ్చినా, తెలంగాణ విద్యార్థులు చేరటం లేదు. దీనికి తోడు, ఆర్టికల్ 371-డి ప్రకారం బయటి రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివిన తెలంగాణ విద్యార్థి.. సొంత రాష్ట్రమైన తెలంగాణలో నాన్‌లోకల్‌గానే పరిగణించబడుతున్నాడు. దీంతో బయటి రాష్ట్రపు కాలేజీ సంగతే ఇక్కడి విద్యార్థులు మరిచిపోవాల్సిన దుస్థితి.దేశవ్యాప్తంగా 2018 నాటికి 499 మెడికల్ కాలేజీలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 706 అయింది. 2018తో దేశంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 70,012 కాగా, ప్రస్తుతం అది 1,08,940 సీట్లకు పెరిగింది. అయితే, మొత్తం కాలేజీల్లో 270 కాలేజీలు దక్షిణాదిలోని 5 రాష్ట్రాలకు చెందినవే. వీటిలో 43,525 సీట్లున్నాయి. అంటే.. 23 రాష్ట్రాల్లో కాలేజీల సంఖ్య 436 మాత్రమే కాగా వీటిలోని సీట్లు 65,415 మాత్రమే. దక్షిణాదిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నాలుగైదేళ్లకోసారి కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తూ రావటంతో ఇక్కడ మెడికల్ సీట్ల సంఖ్య పెరుగుతోంది. అయితే, ఈ రాష్ట్రాల్లో నీట్ రాసే విద్యార్థుల సంఖ్య మాత్రం పెద్దగా పెరగలేదు. 2018లో 5 దక్షిణాది రాష్ట్రాల నుంచి 4,24,523 మంది నీట్‌కు హాజరుకాగా.. 2024 నాటికి ఆ సంఖ్య 5,82,845కు చేరింది. అంటే.. ఏడేళ్లలో 1,58,322 మంది విద్యార్థులే పెరిగారు. దీనికి భిన్నంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌ల నుంచి నీట్ రాసే విద్యార్థుల సంఖ్య ఏటా వేగంగా పెరుగుతోంది. ఈ 6 రాష్ట్రాల నుంచి 2018లో 4,78,255 మంది విద్యార్థులు నీట్‌కు హాజరుకాగా.. 2024లో ఈ సంఖ్య 11,57,180కు చేరింది. ఈ లెక్కలను బట్టి ఉత్తరాదిలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నదే తప్ప కళాశాలల సంఖ్య పెరగడం లేదు. దీంతో వీరంతా దక్షిణాది కాలేజీల మీద ఆధారపడుతున్నారు. దీంతో ఇక్కడి విద్యార్థులకు నష్టం జరుగుతోంది. కేంద్రీకృత విధానంలో కీలక పరీక్షలు నిర్వహించటమూ సమస్యలకు దారితీస్తోంది. ముఖ్యంగా ఎక్కడో బీహార్‌లో పేపర్ లీక్ అయితే, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఇబ్బంది పడక తప్పని పరిస్థితి. మనదేశంలో నీట్-యూజీ, జేఇఇ, యూజీసీ-నెట్, సీయూఈటీ వంటి సుమారు 15 ప్రధాన పరీక్షలు నేటికీ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల సేవల మీద ఆధారపడే జరుగుతున్నాయి. సిబ్బంది, ఐటీ సిస్టమ్‌లు, క్యూఆర్ కోడ్స్ వంటి పనులన్నీ ఏజెన్సీల మనుషులే చేస్తున్నారు. ఇటీవల లీకయిన నీట్ ప్రశ్నాపత్రం తాలూకూ విచారణలో కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు బయటికొచ్చాయి. అహ్మదాబాద్ నుంచి ఓ ప్రైవేటు కొరియర్ సంస్థ ద్వారా రాంచీకి నీట్ ప్రశ్నపత్రాలు వచ్చాయి. వాటిని అక్కణ్నుంచి స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌కి చేర్చి, తర్వాత బ్యాంకు నుంచి ఎగ్జామ్ సెంటర్‌కు చేర్చాల్సి ఉంది. అయితే, సదరు కొరియర్ కంపెనీ రాంచీకి వచ్చిన ప్రశ్నపత్రాలను తన సొంత వాహనంలో తీసుకుపోవాల్సింది పోయి.. ఆ సమయానికి అక్కడ కనిపించిన ఈ-రిక్షాను బుక్ చేసింది. ఇక పరీక్ష మీద థర్డ్ పార్టీ చేసిన రివ్యూలో అనేక లోపాలు బయటపడ్డాయి. అన్ని రాష్ట్రాల్లో కలిపి దాదాపు 4 వేల కేంద్రాల్లో నీట్ పరీక్ష జరగగా, వీటిలో 399 కేంద్రాల్లో ఈ సర్వే జరిగింది. నిబంధనల ప్రకారం.. ప్రతి పరీక్ష కేంద్రపు గదిలో రెండు సీసీ కెమెరాలుండటంతో బాటు వీటిని ఢిల్లీలోని ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలి. కానీ, ఈ సర్వేలో 399 సెంటర్లకు గాను 186 కేంద్రాల్లోని (46%) తరగతి గదుల్లో సీసీ కెమెరాలు పనిచేయలేదు. అలాగే, 68 కేంద్రాల్లో ప్రశ్నపత్రాలు భద్రపరచే స్ట్రాంగ్ రూములకు ఎలాంటి గార్డుల కాపలా లేదు. 83 కేంద్రాల్లో.. ఉండాల్సిన బయోమెట్రిక్ సిబ్బందికి బదులుగా వేరే వ్యక్తులు ఉన్నట్టు గుర్తించారు. ఇంత టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో ఎందుకు నిర్వహించటం లేదు? ఏదైనా తప్పు చేసి బ్లాక్‌లిస్టులోకి చేరిన ఔట్ సోర్సింగ్ పరీక్ష నిర్వహణా సంస్థల మీద నామ మాత్రపు చర్యలే గాక మళ్లీ మళ్లీ వారికే పరీక్ష నిర్వహించే బాధ్యతలు ఎలా దక్కుతున్నాయి

# వరంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన..
## రాకేశ్ రెడ్డి సహా 40 మంది హౌస్ అరెస్టు



వరంగల్: ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకు అని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీఆరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై ఈ అంక్షలు ఎందుకు అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఏనుగుల రాకేశ్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. రాకేశ్ రెడ్డి సహా 40 మంది మంది ముఖ్య కార్యకర్తల నిర్బంధించారు. దీంతో ప్రభుత్వం తీరుపై రాకేశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆరు నెలల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. తమకు కొట్లాడటం కొత్తకాదని తెలిపారు. కేవలం నిర్మాణాత్మక సూచనలను ప్రజల కోణంలో విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి సహా సగం కేబినెట్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓ ప్రైవేటు హాస్పిటల్ ఓపెనింగ్ కోసం ఎగవేసుకుని వస్తున్నారని.. అయినప్పటికీ వరంగల్‌కు సీఎం వస్తున్నాడన్న వాతావరణమే ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు.తెలంగాణ భవన్‌లో తన ప్రెస్ మీట్ తర్వాతే సీఎం పర్యటనలో మార్పులు వచ్చాయని ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రశ్నించేదాక సీఎం హోదాలో ఎలా పర్యటించాలో ఆయనకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. కాకతీయ కళాతోరణాన్ని అధికారిక చిహ్నం నుంచి తొలగించడంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.కాకతీయ కళా తోరణం రాచరిక దర్పం అన్న వ్యాఖ్యలు ఓరుగల్లు ప్రజలను తీవ్రంగా బాధించాయని ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. కాబట్టి, సీఎం రేవంత్ రెడ్డి ఆ మాటలు వెనక్కి తీసుకొని, ఓరుగల్లు ప్రజలకు బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ దాటేలోగా కాకతీయ తోరణం తొలగింపుపై స్పష్టత ఇవ్వాలన్నారు. లేకపోతే, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులంతా రేవంత్ రెడ్డి ఇంటిముందు టెంటు వేసుకొని ధర్నా చేయాలని సూచించారు. లేదంటే మీ క్యాంప్ ఆఫీస్‌ల ముందు ప్రజలు కుర్చుకుంటారని చెప్పారు. కడుపు మీద కొట్టినా ఓర్చుకుంటాం. కానీ, మా ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

# తెలంగాణలో బ్లాక్ బుక్ సంచలనం

కరీంనగర్, జూన్ 29,హాట్ టాపిక్ గా బ్లాక్ బుక్ వార్నింగ్..తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బ్లాక్ బుక్ హెచ్చరిక హాట్‌టాపిక్‌గా మారింది. అధికార కాంగ్రెస్ నేతల అవినీతికి వంతపాడుతున్న అధికారులు, అక్రమాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నేతలు రాష్ట్రంలో మళ్లీ బ్లాక్ డేస్ తెస్తున్నారని.. అలాంటి వారిపై చర్యలకు బ్లాక్ బుక్ రాస్తానని ప్రకటించారు కౌశిక్‌రెడ్డి. రామగుండం ఎన్టీపీసీ బూడిద తరలింపులో అక్రమాలపై మంత్రి పొన్నం 100కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపిస్తూ కొద్ది రోజుల క్రితం తీవ్ర ఆరోపణలు చేశారు కౌశిక్‌రెడ్డి.ఈ క్రమంలో పొన్నం తప్పు చేయలేదంటే వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ చేశారు. ఈ క్రమంలోనే తాను బ్లాక్ బుక్ రాస్తున్నానని ?. అందులో తొలి పేరు మంత్రి పొన్నందేనంటూ బుక్‌లో రాసి మీడియాకు ప్రదర్శించారు కూడా? అయితే ఇంతకీ ఈ బ్లాక్ బుక్ రాయాలనే ఆలోచన కౌశిక్‌రెడ్డి సొంతంగా తీసుకున్నదా? పార్టీ సూచనలు, ఆదేశాలు ఏమైనా ఉన్నాయా? అన్నది మాత్రం స్పష్టం కాలేదు. తాను రాసే బ్లాక్ బుక్‌లో పేర్లు ఉన్నవారిపై బీఆర్ఎస్ అధికారంలో రాగానే చర్యలు ఉంటాయని కౌశిక్‌రెడ్డి చెప్పడం? ఇటు బీఆర్ఎస్‌లోనూ.. అటు కాంగ్రెస్‌లోనూ చర్చనీయాంశంగా మారింది. అసలు ఏ అధికారంతో పార్టీ తరపున కౌశిక్‌రెడ్డి ప్రకటన చేస్తారంటూ గులాబీ పార్టీ నేతలే గొణుక్కుంటున్నారు.ఏపీలో టీడీపీ యువనేత లోకేశ్ రెడ్‌బుక్ నుంచి స్ఫూర్తి పొంది? కౌశిక్‌రెడ్డి అలాంటి ప్రకటన చేశారా? అంటూ కొందరు ఆరా తీస్తున్నారు. లోకేశ్ అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడిగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో పార్టీలో నిర్ణయం తీసుకుని రెడ్‌బుక్ రాశారని?. కౌశిక్‌రెడ్డికి పార్టీలో ఏం అధికారం ఉందని వారు ప్రశ్నిస్తున్నారు. నిన్న గాక మొన్న పార్టీలో చేరి? ఈటల రాజేందర్ పుణ్యమా అని ఎమ్మెల్సీ అయిపోయారని? కాలం కలిసివచ్చి ఎమ్మెల్యే అయినంత మాత్రాన తనదే పార్టీ అన్నట్లు బ్లాక్ బుక్ రాయడమేంటని ప్రశ్నిస్తున్నారు మరికొందరు నేతలు.కేటీఆర్ లేదా కేసీఆర్ లు ఏమైనా కౌశిక్‌కు ప్రత్యేక అధికారాలిచ్చారా? అంటూ కొంతమంది బీఆర్ఎస్ నేతలే ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై అణచివేతతోపాటు తమ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న అధికారులను హెచ్చరించడానికి లోకేశ్ రెడ్‌బుక్ రాస్తున్నట్లు చెప్పారు. తన యువగళం పాదయాత్రలో కార్యకర్తల వేదనను చూసి ఆ నిర్ణయం తీసుకున్నారు. కానీ, తెలంగాణలో కౌశిక్‌రెడ్డి సొంత వ్యవహారంలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదారు నెలలకే బ్లాక్‌బుక్ అంటూ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయడం సరికాదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.బూడిద తరలింపులో జిల్లా మంత్రితో వచ్చిన గొడవను? పార్టీకి ఆపాదిస్తూ బ్లాక్ బుక్ రాయడానికి కౌశిక్ ఎవరనే చర్చ మొదలైంది. మరోవైపు కౌశిక్ రెడ్డి చేసిన ప్రకటనకు మద్దతుగా ఆ పార్టీలో ఏ నేత మాట్లాడటం లేదు. దీంతో కౌశిక్‌రెడ్డి బ్లాక్ బుక్ వ్యవహారంతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదనే వాదన వినిపిస్తోంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు మాజీ మంత్రులు సైతం?. కౌశిక్‌రెడ్డి, మంత్రి పొన్నం మధ్య వివాదాన్ని ఓ జిల్లా ఇష్యూగానే పరిగణిస్తున్నట్లు చెబుతున్నారు. అలాంటప్పుడు కౌశిక్‌రెడ్డి బ్లాక్‌బుక్‌కు ఏ మాత్రం సీరియస్‌నెస్ ఉండదనే అభిప్రాయమే వ్యక్తమవుతోంది. ఇలాంటి రాతలు, ప్రకటన వల్ల పార్టీ ఇమేజ్ మరింత డామేజ్ అయ్యే అవకాశం కూడా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.లోకేశ్‌తో తనను తాను పోల్చుకోవడం కౌశిక్‌రెడ్డికి అడ్వాంటేజ్ ఏమో గాని? బ్లాక్‌బుక్ వంటి ప్రకటనతో సీరియస్ అంశాన్ని నీరుగార్చే అవకాశం ఉంటుందని కొందరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి కౌశిక్‌రెడ్డి బ్లాక్‌బుక్ నిర్ణయం ఆవేశంగా తీసుకున్నదా? లేక పార్టీ పెద్దలతో నిర్ణయించిన తర్వాతే అలాంటి ప్రకటన చేయాల్సి వచ్చిందా? అన్నది తేలాల్సి వుంది. పార్టీ పరంగా విధాన నిర్ణయాలు తీసుకున్నప్పుడు అగ్ర నేతలో? పార్టీలో పెద్ద పదవుల్లో ఉన్న నేతలో ఇలాంటి ప్రకటన చేస్తే బాగుండేదని బీఆర్ఎస్ వర్గాల అభిప్రాయం. మరి ఇలాంటి పరిస్థితుల్లో కౌశిక్‌రెడ్డి బ్లాక్ బుక్ లో ఇంకా ఎవరెవరి పేర్లు రాస్తారు? ఈ బ్లాక్ బుక్ లో ఎక్కిన నేతలు, అధికారులపై ఎవరు చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# కాంగ్రెస్ ఖాతాలోకి నల్గొండ డీసీసీబీ



నల్గొండ, జూన్ 29, (న్యూస్ పల్స్)ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. డీసీసీబీ ఛైర్మన్ గొంగడి మహేందరరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఆయన పదవి కోల్పోవడంతోపాటు డీసీసీబీ ఛైర్మన్ వ్యవహారంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమ పార్టీకి చెందిన వారికి ముఖ్య పదవులను కట్టేబట్టే ఆలోచనల్లో ఆ పార్టీ నేతలు అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 మంది ఎమ్మెల్యేలు గెలుచుకున్న కాంగ్రెస్.. డీసీసీబీ పీఠంపై కన్నేసింది. 2021 ఫిబ్రవరిలో జరిగిన నసహకార సంఘాల ఎన్నికల్లో గెలిచి ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు (డిసిసిబి) ఛైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్?గా గొంగిడి మహేందర్ రెడ్డి ఎన్నికయ్యారు.డీసీసీబీలో మొత్తం 21 మంది డైరెక్టర్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 19 మందే ఉన్నారు. రిజర్వేషన్ల సభ్యులు లేకపోవడంతో మరో ఇద్దరిని నామినేట్ చేయలేదు. 19 మంది డైరెక్టర్లలో 18 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. మునుగోడు పీఏసీఎస్ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్. ఈ పదవిని తన అనుచరుడికి కట్టబెట్టాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భావించారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 9 మంది డిసిసిబి డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీబీని తన ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ పావులు కదిపింది. దీంతో ఈనెల 10వ తేదీన ఛైర్మన్ మహేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి 14 మంది డైరెక్టర్లు నోటీసులు ఇచ్చారు.డీసీసీబీ ఛైర్మన్ పదవిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరుడు కుంభం శ్రీనివాస్ రెడ్డి ఆశిస్తున్నారు. 19 మందిలో 15 మంది డైరెక్టర్ల మద్దతు కూడగట్టిన శ్రీనివాస్ రెడ్డి క్యాంపుకు తీసుకెళ్లారు. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్ అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. 14 మంది డైరెక్టర్లు క్యాంపు నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చారు. అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్?కు ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో పాటు మరో ముగ్గురు బిఆర్ఎస్ డైరెక్టర్లు సమావేశానికి హాజరు కాలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా పదిమంది కాంగ్రెస్ డైరెక్టర్లతో పాటు బీఆర్ఎస్?కు చెందిన ఐదుగురు డైరెక్టర్లు కూడా మద్దతు ఇచ్చారు. దీంతో ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆయన డీసీసీబీ ఛైర్మన్ పదవిని కోల్పోయారు. ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో తాత్కాలిక ఛైర్మన్?గా బాధ్యతలను వైస్ ఛైర్మన్ ఎసిరెడ్డి దయాకర్ రెడ్డి చేపట్టారు.

# పాస్ బుక్... ప్రమాణికం...

మహబూబ్ నగర్, జూన్ 29, (న్యూస్ పల్స్) తెలంగాణలో రైతు రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. అలాగే రుణమాఫీకి తెల్ల రేషన్ కార్డు ప్రామాణికం కాదని తెలిపారు. రేషన్ కార్డు కేవలం కుటుంబాన్ని గుర్తించడం కోసమే అన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకూ రుణమాఫీ చేస్తామన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజుల్లో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి... రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని చెప్పారు. రైతుల పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదన్నారు. అయితే బంగారంపై తీసుకున్న రుణాలు మాఫీ కావని సీఎం స్పష్టం చేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుందన్నారు. రైతు రుణమాఫీ తర్వాత రైతుభరోసా ఇతర పథకాలపై దృష్టి పెడతామన్నారు. తెలంగాణ బడ్జెట్ ను వాస్తవ అంచనాలకు అనుగుణంగా రూపొందించాలని అధికారులకు సూచించామన్నారు. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీ ముందుకు తెస్తామన్నారు. అసెంబ్లీలో చర్చించి డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు.రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని, కేవలం పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో రెవెన్యూ పెరిగిందన్నారు.

# చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ : కేటీఆర్



హైదరాబాద్ : చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ గాయకుడు, మాజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలోవారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు కేటీఆర్.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సాయిచంద్ మరణించి ఏడాది అవుతుందంటే ఎవరం నమ్మలేకపోతున్నాం. తన మాటతో, పాటతో అద్భుతమైన వాగ్దాటితో తెలంగాణ ప్రజలను ఉర్రూతలూగించిన అద్భుత కళాకారుడు సాయిచంద్. మన అందరి ఆప్తుడు.. చిరకాలం మా గుండెల్లో నిలిచపోయే తమ్ముడు. భవిష్యత్‌లో సాయి కుటుంబం కోసం ఎల్లవేళలా పార్టీ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటాం. ఆనాటి నుంచి నేటి వరకు ఎలా అండగా ఉన్నామో భవిష్యత్‌లో కూడా ఉంటాం. సాయి జ్ఞాపకార్థం పాటల సీడీలు, సంకలనాలు, పుస్తకాలు తీసుకొచ్చిన సోదరులకు అభినందనలు. తమ్ముడి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అని కోరుకుంటూ కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.తెలంగాణ ఉద్యమ గాయకుడు, మాజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ వేద సాయిచంద్ గారి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి,?

# ఆర్మీ జవాన్?కు 20 ఏళ్ల జైలు శిక్ష..
## సుదీర్ఘకాలం కోర్టులో విచారణ.. అసలు కారణం ఇదే..



సాధారణంగా ఆర్మీ అంటేనే ప్రతి ఒక్కరికి అపారమైన అభిమానం ఉంటుంది. అలాంటి ఆర్మీ వృత్తిలో ఉన్న ఒక జవాన్?కు సికింద్రాబాద్ కోర్టు 20 ఏళ్ల పాటు జైలు శిక్ష విధించింది.2017లో సికింద్రాబాద్లో ఉన్న ఒక లాడ్జ్?లో ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడ్డడు ఆ కీచక జవాన్. ఆర్మీ జవాన్?గా పనిచేస్తున్న శ్రీధరన్ ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. 2017లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సుదీర్ఘకాలంగా పోలీసులు అనేక రకాల ఆధారాలు సేకరించారు. 2017 లోనే రిటైర్డ్ అయిన ఆర్మీ జవాన్ శ్రీధరన్ స్థానికంగా ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ తరుణంలోనే ఒక మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టి కేసులో రిటైర్డ్ ఆర్మీ జవాన్?ను మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్?కు తరలించారు. ఈ కేసు?పై గతంలోనే చార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు సంబంధిత ఆధారాలను సేకరించి జావాన్?కు శిక్షపడేలా చర్యలు తీసుకున్నారు.ఒక బాలికను లాడ్జిలోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేసి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. లాడ్జి నుండి బయటికి వచ్చిన బాలిక నేరుగా మార్కెట్ పోలీస్ స్టేషన్?కు వెళ్లింది. మార్కెట్ పోలీసులకు జరిగిన విషయం మొత్తం చెప్పటంతో ఆర్మీ జవాన్ శ్రీధరన్?పై అప్పటి మార్కెట్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత పోలీసులు అన్ని ఆధారాలను కోర్ట్?కు పగడ్బందీగా సమర్పించడంతో రిటైర్డ్ ఆర్మీ జవాన్ శ్రీధరన్?కు 20 ఏళ్లపాటు జైలు శిక్ష విధించింది స్పెషల్ కోర్టు. ఈ సంఘటనతో పలు మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా న్యాయస్థానాలు త్వరితగతిని పెండింగ్లో ఉన్న కేసులను కూడా పరిష్కరించాలని కోరుతున్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలంటే ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే ప్రజల్లో, సమాజంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ఉధృతికి కొట్టకుపోయిన పశువులు

ఆసిఫాబాద్, జూన్ 29, (న్యూస్ పల్స్)కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వరద ఉధృతికి పశువులు కొట్టుకుపోయాయి. కాగజ్ నగర్ మండలం అందవెల్లి సమీపంలోని పెద్దవాగుకు శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వరద ప్రవాహం భారీగా పెరిగింది. ఎగువన కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతి పెరగ్గా.. పశువులు కొట్టుకుపోయాయి. వాగును దాటే క్రమంలో దాదాపు 50 పశువులు ప్రవాహానికి వాగులో కొట్టుకుపోతూ కనిపించాయి. అయితే, దీన్ని చూసిన పశువులు కాపరి కేకలు వేస్తూ సాయం కోసం అర్థించాడు. అదృష్టవశాత్తు బ్రిడ్జి

పిల్లర్ల వద్ద పశువులు ప్రవాహ ఉధృతిని తట్టుకుని ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరాయి. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ తతంగాన్ని స్థానికులు వీడియో తీయడంతో నెట్టింట వైరల్‌గా మారాయి.మరోవైపు, ఇదే ఆసిఫాబాద్ జిల్లా వరద ప్రవాహంలో చేపల కోసం జనం ఎగబడ్డారు. వాంకిడి మండలం నవేదరి గ్రామ చెరువులో భారీ వర్షానికి వరద ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో ప్రవాహంలో చేపలు కొట్టుకుపోతుండగా గ్రామస్థులు అక్కడకి చేరుకుని వలలు, వస్త్రాలతో చేపలు పట్టేందుకు ఎగబడ్డారు. పెద్ద పెద్ద చేపలు చిక్కడంతో హర్షం వ్యక్తం చేశారు.

## మాజీ మంత్రి డీఎస్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం



హైదరాబాద్ : మాజీ మంత్రి డి శ్రీనివాస్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు శనివారం తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. 2004, 2009లో మంత్రిగా సేవలందించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నసమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అంతా ఆయనను డీఎస్ అని పిలిచేవారు. ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లోనే ఉంచారు. సాయంత్రం నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి పార్థీవదేహాన్ని తరలించనున్నారు. డీఎస్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు.

## జార్ఖండ్‌లో బీజేపీ తుడిచిపెట్టుకుపోతుంది: హేమంత్ సోరెన్



రాంచీ: జార్ఖండ్‌లో బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందని మాజీ సీఎం హేమంత్ సోరెన్ అన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో దీని కోసం కృషి చేస్తానని శపథం చేశారు. దేశంలో సామాజిక నిర్మాణాన్ని నాశనం చేయడంలో బీజేపీకి నైపుణ్యం ఉందని విమర్శించారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. మనీలాండరింగ్ కేసులో బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన హేమంత్ సోరెన్, శనివారం రాంచీలో జేఎంఎం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీపై ఆయన మండిపడ్డారు.జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని బీజేపీ పగటి కలలు కంటోందని హేమంత్ సోరెన్ ఎద్దేవా చేశారు. 'మాపై కుట్ర పన్నిన వారికి తగిన సమాధానం చెబుతాం. బీజేపీ శవపేటికకు చివరి మేకు వేసే సమయం వచ్చింది. జార్ఖండ్‌లో కమలం పార్టీ తుడిచిపెట్టుకుపోతుంది' అని అన్నారు.కాగా, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ముందుగానే జరుగవచ్చని హేమంత్ సోరెన్ అంచనా వేశారు.'రాష్ట్రంలో (అసెంబ్లీ) ఎన్నికలు ముందుగానే జరగవచ్చని నాకు సమాచారం అందింది. మేం సిద్ధంగా ఉన్నాం' అని పార్టీ కార్యకర్తలనుద్దేశించి అన్నారు.మరోవైపు మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్ట్ గురించి హేమంత్ సోరెన్ మాట్లాడారు. 'నిజాన్ని ఎవరూ దాచలేరు. త్వరలో లేదా ఆ తర్వాతైనా అది బయటకు వస్తుంది' అని తెలిపారు. మీకు నాయకత్వాన్ని అందించడానికి మరోసారి మీ ముందుకు వచ్చానని అన్నారు.

## ఆమె మమ్మల్ని జైల్లో పెట్టించారుగానీ ఎన్నడూ దేశద్రోహులని దూషించలేదు : లాలూ యాదవ్

ప్రతిపక్ష నేతలపట్ల నరేంద్రమోదీ సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కూడా మమ్మల్ని జైల్లో పెట్టారు కానీ ఏనాడు దేశద్రోహులని దూషించలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటి ప్రభుత్వం విపక్ష నేతలపై కేసులు పెట్టి జైలుకు పంపుతూ దేశ ద్రోహులుగా ముద్రవేస్తోందని విమర్శించారు.ఈ మేరకు జర్నలిస్ట్ నళిన్ వర్మతో కలిసి తను రాసిన 'ది సంఘ్ సైలెన్స్ ఇన్ 1975 (ఽష్ట్రవ రాజీనిణష్ట్రరాతిశ్రీవనిఙవ తిని 1975)' అనే ఆర్టికల్‌ను లాలూ యాదవ్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఆ ఆర్టికల్‌లో మోదీ సర్కారు వైఖరిని ఎండగట్టారు. ఎమర్జెన్సీ సమయంలో సంఘ్ మౌనంగా ఎందుకున్నదని ప్రశ్నించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడితే తమను జైల్లో వేశారని, మిసా (ఓమోం) చట్టం కింద మాపై కేసులు బనాయించారని లాలూ యాదవ్ గుర్తుచేశారు. తాను 15 నెలలపాటు జైలు జీవితం గడిపానని ఆయన తెలిపారు.ఇప్పుడు ఎమర్జెన్సీ గురించి లెక్చర్లు దంచుతున్న ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గ సహచరుల్లో చాలామంది ఎవరో కూడా అప్పట్లో ఎవరికీ తెలియదని వ్యాఖ్యానించారు. 1975లో నరేంద్రమోదీ, జేపీ నడ్డా ఎవరికి తెలుసని ప్రశ్నించారు. మోదీ సర్కారు ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూనే, విపక్ష నేతలను తప్పుడు కేసులతో హింసిస్తూనే స్వాతంత్ర్య విలువల గురించి ఊకదంపుడు ప్రసంగాలు చేస్తోందని మండిపడ్డారు.



# ఉభయ రాష్ట్రాల సమస్యలపై చర్చించాలి

హైదరాబాద్,జూన్29: ఆర్థికస్థితి వెక్కిరిస్తున్న వేళ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీపై గురుతర బాధ్యతలు ఉన్నాయి. ఎన్నికల ముందు లేవనెత్తిన వివిధ సమస్యలను నెమరు వేసుకుని పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రధానంగా ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సి ఉంది. ఉదార పథకాలను పక్కన పెట్టి బొక్కసం నిండుకునేలా మెల్లగా అడుగులు వేయాలి. అనేక పథకాలను సమీక్షించి కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఆర్థిక క్రమశిక్షణ సాధ్యం కాదు. ఇందులో ప్రధానంగా ధరణి అక్రమాలను నిరోధించాలి. రైతుబంధును సరళీకరించాలి. చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే సాయం అందేలా చూడాలి. ఫామ్‌హౌజ్‌ల కోసం కొనుకున్న భూములకు రైతుబంధు అమలు చేయకుండా చూడాలి. కిలో రూపాయి బియ్యంపైనా సమీక్షించాలి. మార్కెట్లో బియ్యం ధరలు మండిపోతున్నాయి. ఈ క్రమంలో కిలో రూపాయి బియ్యం ఇవ్వడం దోచి పెట్టడమే తప్ప మరోటి కాదు. ఇబ్బడిముబ్బడిగా ఉన్న తెల్లకార్డులను తొలగించాలి. పేదరికంపై హేతుబద్ధత ఆధారంగా ముందుకు సాగాలి. డబ్బుల పందేరం చేసే కార్యక్రమం లేదా పథకం ఏదైనా సమీక్షించాల్సిందే. ఎస్సీ కార్పోరేషన్ను పునరుద్ధరించి దళితులు స్వయంశక్తితో ఎదిగేందుకు వడ్డీరహిత రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించాలి. అలాగే ఇబ్బడిముబ్బడిగా సలహాదారులను పెట్టే సంప్రదాయాన్ని పక్కన పెట్టాలి. వీటికి లక్షల్లో జీతాలు తగలేసి, ప్రభుత్వ ఖజానాను దివాళా తీయించడం మానుకోవాలి. ఇకపోతే విభజన సమస్యలపై కేంద్రంతో పోరాడి సాధించాలి. ఆనాడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పార్లమెంట్ వేదికగా నిలదీయడంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు ముందుండాలి. ఎపి విభజన జరిగాక ఇరు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి పెంచలేక పోయాయి. అందువల్ల కేంద్రం నిర్మాణా త్మక సహకారం అందించలేక పోయింది. ఎపి రాజధానిపై కేంద్రం చేతులెత్తేసింది. విశాఖ స్టీల్ ఆందోళనలను పట్టించుకోవడంలేదు. కడప ఉక్కును పక్కన పెట్టారు. బయ్యారం ఉక్కు ఊసే లేదు. ఇక ఏంచేశారో చెప్పడానికి ఏమీ లేదు. ఉభయరాష్ట్రాల మధ్య సమస్యలను పట్టించుకోలేదు. కృష్ణా, గోదావరి

### ఉమమడిగా పోరాడితేనే సానుకూలత

జలవివాదాన్ని కూడా సత్వరంగా పరిష్కరించాలన్న ఆలోచన చేయలేదు. విభజన సమస్యల పరిష్కారం పేరుతో కమిటీ వేసినా..విభజన హామీలపై మాత్రం కేంద్రం నోరు మెదపడం లేదు. దీనిపై ఈ రెండు రాష్ట్రాలు నేరుగానే పోరాడాల్సిన అవసరం ఇప్పుడు వచ్చింది. సమస్యలను నాన్చకుండా త్వరగా పోరాడితేనే మంచిది. స్థానిక బిజెపి నేతలు కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సమస్యలు ప్రస్తావించి సాధించే తెలివిని ప్రదర్శించలేదు. దూకుడు రాజకీయాలతో, వారు చేస్తున్న విన్యాసాలు అభాసుపాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో గత విభజన సమయంలో ఇచ్చిన హామీలను ముందుకేసి..అసలు కేంద్రం ఎందుకిలా వ్యవహరిస్తున్నదో నిలదీయాలి. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం రాష్ట్రానికి ద్రోహం చేసినా వైసిపి పెద్దగా పోరాడలేదు. మోడీ బురిడీ కొట్టించి కాలయాపన చేయడంతో పదేళ్లు గడిపేశారు. గతంలో దీర్ఘకాలం బిజెపితో టిడిపి సాగించిన పొత్తు రాజకీయాలు ఇప్పుడు అవకాశంగా తీసుకోవాలి. ఇక్కడ కూటమి ప్రభుత్వం ఉన్నందున తగిన చొరవ తీసుకునేలా చంద్రబాబు కృషి చేయాలి. కృష్ణపట్నం జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం అదానీకి ధారాదత్తం చేస్తున్నది. గంగవరం పోర్టును అప్పగించేశారు. సహకార చెక్కర, పాలసంఘాలను దెబ్బతీశాయి. ప్రత్యేకహోదాను పక్కనపెట్టి ఇద్దరూ కీచులాడుకున్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో ఎన్‌డిఎ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినందున గతంలో లాగా దూకుడు ప్రదర్శించకపోవచ్చు. కాబట్టి ఇరు తెలుగు రాష్ట్రాల నేతలు ఉమ్మడిగా పోరాటం చేస్తే మంచిది.తెలుగు రాష్ట్రాల భవిష్యత్ ఏమిటన్నది ఉమ్మడిగా చర్చించాల్సిన అవసరం ఉన్నది. ప్రధానంగా తెలంగాణకు సంబంధించి ఇక్కడి కాంగ్రెస్ గట్టిగా నిలదీయాల్సిందే. బిజెపి నేతలను కూడా నిలదీయాలి. లేకుంటే సమస్యలు సమస్యలుగానే ఉంటాయి.

# ఉమ్మడి జిల్లాలో చురుకుగా కాంగ్రెస్

### స్థానిక ఎన్నికలే లక్ష్యంగా సాగుతున్న రాజకీయం
### పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టామన్న షబ్బీర్ అలీ

నిజామాబాద్,జూన్29: ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి నేతలకు అవకాశం దొరికింది.ఇప్పటికే అంతా మళ్లీ పాతగూటికి చేరుతున్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేలా అడుగుల వేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గత ఆరనెలలుగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కార్యకలాపాలు పెరిగాయి. ఇప్పుడు కార్యకర్తలు కూడా ధైర్యంగా కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, షబ్బీర్ అలీ ప్రభుత్వ సలహాదారు కావడంతో అనేక కార్యక్రమాలకు అవకాశం ఏర్పడింది. జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి షబ్బీర్ అలీ ఇప్పటికే పలు కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో పార్టీ విస్తరణకు గల అవకాశాలను అందిపుచ్చు కుంటున్నారు. ప్రధానంగా జిల్లాలో పసుపు, ధాన్యం, ఎర్రజొన్న రైతుల సమస్యలపై పోరాడడం ద్వారా రైతుల్లో కొంత సానుభూతిని సాధించారు. ఈ విషయాల్లో బిఆర్ఎస్, బిజెపిలు విఫలం అయ్యాయని షబ్బీర్ అలీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసామని అన్నారు. త్వరలోనే రుణమాఫీతో వారిలో మరింత భరోసా పెరగనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రైతులకు ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీకి అడుగు పడుతోంది. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ అనుసంధానం, పంట బీమా, వరికి క్వింటాల్‌కు రూ.2500 చెల్లిస్తామన్నారు. రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికే పసుపు రైతుల పోరాటానికి మద్దతుగా నిలిచి ఇక్కడి కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. ఎన్నికల ఫలితాలు కూడా అనుకూలంగా రావడంతో ఇంతకాలం స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలకు నయాజోష్ వచ్చిందని షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో ఆర్మూర్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ రైతు భరోసా దీక్ష విజయవంతమైంది. ఆశావహులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీనికితోడు మాజీ ఎంపీ మధుయా ష్కీ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ ల వల్ల అదనపు బలంగా మారింది. జిల్లా రాజకీయాల్లో వీరు కూడా తమవంతుగా ఉత్సాహం నింపుతున్నారు. మధుయాష్కి నిజామాబాద్ పార్లమెంట్ నుంచి రెండు పర్యాయాలు ప్రాతినిథ్యం వహించారు. ఆయనకు అధినాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అలాగే, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌తో నాయకులకు, కార్యకర్తలకు చనువు వుంది. ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పటి నుంచి అందరితో సంబంధాలు ఉన్నాయి. మొత్తంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీలో క్రియాశీలకంగా ఉండాలని చాలామంది ముందుకు వస్తున్నారని అన్నారు. గత మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. అనేక చోట్ల పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకలేదు. కాంగ్రెస్‌కు నాయకత్వ కొరత ఉండడంతో అనేక మంది బీజేపీ వైపు మొగ్గు చూపారు. ఆ పార్టీ టికెట్ కోసం పోటీ పడ్డారు. స్థానికంగా కాంగ్రెస్ నాయకులను పట్టించుకునే వారు లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఈ సమస్యలు ఇక ఉండవని షబ్బీర్ అభిప్రాయపడ్డారు. మెల్లగా పాతవారందరూ మళ్లీ కాంగ్రెస్ పార్టీ గూటికి వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిన వారికి ఇప్పుడు మళ్లీ అవకాశం వచ్చింది. మున్ముందు స్థానిక ఎన్నికలు ఉండడంతో పరిస్థితి మారుతోంది. స్థానిక ఎన్నికల్లో జిల్లాలో బలం చాటుతామని షబ్బీర్ అలీ కూడా ధీమాగా ఉన్నారు.

# ఆదిలాబాద్ మాజీ ఎంపి రామేశ రాథోడ్ మృతి

### ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత
### సంతాపం తెలిపిన సిఎం రేవంత్, కేంద్రమంత్రులు, బిజెపి నేతలు

ఆదిలాబాద్,జూన్29: ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్(59) కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకువస్తుండగా.. మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని ఉట్నూర్‌కు తరలించారు. రమేష్ రాథోడ్ మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. తెదేపా తరఫున 1999లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా రమేష్ రాథోడ్ ఎన్నికయ్యారు. 2009లో ఆ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెదేపా నుంచి భారాసలో చేరారు. అనంతర పరిణామాల్లో కాంగ్రెస్‌లో చేరి 2019లో ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత భాజపాలోకి వెళ్లారు. ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. శనివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆయన మరణించారు. శుక్రవారం రాత్రి రమేష్ రాథోడ్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి ఆయన్ని తరలించారు. అయితే శనివారం ఉదయం మెరుగైన వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆయన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆ క్రమంలో ఆయన మృతి చెందారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గానే కాకుండా లోక్‌సభ సభ్యుడిగా రమేష్ రాథోడ్ పని చేశారు. తెలుగుదేశం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో రమేశ్ రాథోడ్ కీలక నేతగా పని చేశారు. ఆయన స్వస్థలం నార్నూర్ మండలం తాడిహత్నూర్. రాథోడ్ మృతికి సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తెలంగాణకు తీరని లోటని అన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయ నేత అని అన్నారు. మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్ రాథోడ్ మృతిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. రమేశ్ రాథోడ్ బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ చాలా ఉత్సాహంగా పార్టీకోసం కష్టపడ్డారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. జడ్పీటీసీగా ప్రస్థానం ప్రారంభించి.. జడ్పీచైర్మన్ గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా నిరంతరం ప్రజలతో గడపడానికే ఇష్టపడే వారన్నారు. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడే.. రమేశ్ రాథోడ్ ఇకలేడనే వార్త బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మిృతి పార్టీకి తీరని లోటని బిజెపి ఎంపి లక్ష్మణ్, మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇది దిగ్భ్రాంతి కలిగించే విషయమని అన్నారు.

# నాన్నా ఎప్పికీ నీవే నా హీరో

### భావోద్వేగానికి గుర్తైన ఎంపి అర్వింద్

హైదరాబాద్,జూన్29: తండ్రి డిఎస్ తన నిజజీవిత హీరో అని ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ భావోద్వేగానికి లోనయ్యారు. నాన్న నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు.. ఎప్పటికీ నాలోనే ఉంటావంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'అన్నా.. అంటే నేనున్నా అని.. ఏ ఆపదలో అయినా ఆదుకునే శీనన్న ఇక లేరు. ఐ విల్ మిస్ యూ డాడీ!.. నా తండ్రి, నా గురువు అన్నీ మా నాన్నే. ఎదురొడ్డు, పోరాడు, భయపడకు అని నేర్పింది మా నాన్నే. ప్రజలను ప్రేమించు, ప్రజల కొరకే జీవించు అని చెప్పింది మా నాన్నే. నాన్నా..! నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు. ఎప్పటికీ నా లోనే ఉంటావు' అంటూ పోస్ట్ చేశారు.1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్‌లో జన్మించిన డీఎస్.. నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారిగా 1989లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల బరిలో దిగిన ఆయన.. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో గెలుపొందారు. అనంతరం 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. 1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐ అండ్ పీఆర్ మంత్రిగా, 2004 నుంచి 2008 వరకు ఉన్నతవిద్య, అర్బన్ లాండ్ సీలింగ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో అప్పటి టీఆర్ఎస్‌తో పొత్తుకుదుర్చుకోవడంలో కీలకపాత్ర పోషించారు.

# సంతాపం..






సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షులు శ్రీ ధర్మపురి శ్రీనివాస్ గారి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి, మాజీ శాసనసభ సభాపతి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు.డి శ్రీనివాస్ గారి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పోచారం గారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## సీజ్ చేసిన ఇసుక వేలం ద్వారా విక్రయం

భీంగల్, జూన్ 28 : భీమ్గల్ మండలం బెజ్జోరా గ్రామంలోని కప్పల వాగులో సీజ్ చేసిన ఇసుక డంప్ ను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వేలంపాట నిర్వహించి విక్రయించడం జరిగిందని తహసిల్దార్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీంగల్ పట్టణానికి చెందిన జంబుక నరేష్ అనే వ్యక్తి వేలంలో పాల్గొని రూ. 21,000 వేలంపాడి ఇసుక డంపు దక్కించుకున్నారని వివరించారు. కప్పల వాగులో అక్రమంగా ఇసుక డంపు నిల్వ చేశారని సమాచారం అందిన వెంటనే ఈ నెల 25వ తేదీన తనతోపాటు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ క్షేత్రస్థాయికి వెళ్లి ఆ ప్రదేశాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సుమారు 30 నుండి 35 ట్రాక్టర్ లోడ్ల ఇసుక డంప్ అక్రమంగా నిలువ చేసి ఉండడాన్ని కనుగొని దానిని సీజ్ చేశామని అన్నారు. ఇసుక డంప్ చేసిన ప్రదేశంలో నలుగురు వీఆర్ఏలను నియమించగా, వారు రాత్రంతా పర్యవేక్షణ జరిపారని తహసిల్దార్ తెలిపారు. ఆ మరుసటి రోజు అనగా ఈ నెల 26వ తేదీన ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వేలం పాట నిర్వహించి, అత్యధికంగా రూ. 21,000 వేలం పాడిన జంబుక నరేష్ కు సీజ్ చేసిన ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతించడం జరిగిందని వివరించారు. వేలం ద్వారా సమకూరిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేసి, జంబుక నరేష్ కు ఈ మేరకు రసీదు అందించామని తహసీల్దార్ శ్రీలత తెలిపారు.

## హరియాణా రాజ్ భవన్ - చండీగఢ్




29 జూన్, 2024 శ్రీ ధర్మపురి శ్రీనివాస్ గారు రాజ్య సభ మాజీ సభ్యులు, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి మరియు మాజీ పిసిసి అధ్యక్షులు మృతి పట్ల హరియాణా రాష్ట్ర గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారు తన ప్రగాఢ సంతాపం తెలియజేసారు.శ్రీ ధర్మపురి శ్రీనివాస్ గారు గొప్ప రాజకీయ అనుభవం కలిగిన పరిపక్వమైన నాయకులని, కష్ట సమయాల్లో కూడా మంచి నిర్ణయాలు తీసుకునే శక్తి సామర్థ్యం ఉన్న నేత అని, వారు వెనుకబడి వర్గాల నుండి వచ్చి అంచలంచలుగా రాజకీయాల్లో ఎదిగారని, తనకు వారు అత్యంత ఆత్మీయమైన మిత్రులని శ్రీ దత్తాత్రేయ గారు వారితో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. తాను రైల్వే శాఖ సహాయ మంత్రిగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు విచ్చేసి నిజామాబాద్ అభివృద్ధి కోసం మంచి సలహాలు, సూచనలు అందించారని, అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా సలహాలు ఇచ్చేవారని, వారి మృతి దేశ రాజకీయాలకు, ప్రత్యేకించి తెలంగాణ రాజకీయాలకు తీరని లోటు అని, వారి మృతి వల్ల తెలంగాణ ఒక పాత తరం నాయకున్ని కోల్పోయిందని, శ్రీ దత్తాత్రేయ గారు పేర్కొన్నారు. శ్రీ ధర్మపురి శ్రీనివాస్ గారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ కష్టకాలంలో తట్టుకోవడానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భావతంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు శ్రీ బండారు దత్తాత్రయ తెలిపారు.

## కుటుంబ వ్యవస్థే బలం! ( ఆధ్యాత్మిక చింతన )

తిరుపతి,జూన్29: సమాజ శ్రేయానికి కుటుంబ శ్రేయమే బలమైన పునాది. ప్రధానంగా హైందవ కుటుంబ సభ్యుల్లో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లది ఎంతో కీలకమైన పాత్ర. వీరి ఐకమత్యం, అనురాగంమీదనే కుటుంబ గౌరవం, ఆధారపడిఉంది. అందువల్ల మనమంతా భగవంతుడిపై నమ్మకంతో పాటు,,కుటుంబ గౌరవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే మన మానసిక స్థితి బలంగా ఉంటుంది. భారతదేశ కుటుంబ వ్యవస్థ ఎంతో బలమైనదే కాకుండా పవిత్రమైనది కూడా! అంతేకాదు అది ఆదర్శవంత మైనది కూడా. పూర్వం, సమష్టి కుటుంబంలో తల్లిదండ్రుల నీడలో అన్నదమ్ములు, అక్కచెల్లెళు, కొడుకులు, కోడళ్లు అంతా కలిసి పరస్పరసహకారంతో, ప్రేమాభిమానాలతో పదిమందీ మెచ్చుకునే విధంగా, సుఖశాంతులతో, ఏ పొరపొచ్చాలు లేకుండా జీవితం కొనసాగించేవారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఒకరినొకరు సంప్రదించుకొంటూ తమంతట తామే పరిష్కారమార్గాన్ని తెలుసుకునేవారు. కాలాంతరాన సమష్టి కుటుంబాల సంఖ్య బాగాతగ్గి వ్యష్టి కుటుంబాల సంఖ్య పెరగడం మొదలైంది.

# సినిమా తీరు

## సడెన్ గా చూస్తే పుష్ప అనుకునేరు!




పై ఫోటో చూస్తే పుష్ప సీక్వెల్ కు సంబంధించి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కొత్త లుక్ వచ్చిందనుకున్నారా? అయితే మీరు పప్పులో కాలేసినట్లే. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న పుష్ప–2 మూవీ నుంచి ఎలాంటి అప్డేట్ రాలేదు. మరి ఈ లుక్ ఎవరిదా అని ఆలోచిస్తున్నారా? ఆయనెవరో కాదు.. తన రూట్ మార్చుకుని సరికొత్త కాన్సెప్ట్ లతో ఎప్పటికప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తున్న మన టాలీవుడ్ హీరో అల్లరి నరేష్ ది.అవును నిజమే.. అల్లరి నరేష్ దే. ప్రస్తుతం ఆయన బచ్చలమల్లి సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సుబ్బు మంగాదేవి ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి అల్లరి నరేష్ ఫస్ట్ లుక్ ను మేకర్స్ రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే పోస్టర్ ను రిలీజ్ చేస్తూ.. అతడు పేరు మల్లి, ఇంటి పేరు బచ్చల, చేసే పని ట్రాక్టర్ డ్రైవింగ్ అంటూ క్యారెక్టర్ ను రివీల్ చేశారు.ప్రస్తుతం బచ్చలమల్లి సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ మూవీ మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. రేపు అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ గ్లింప్స్ ను రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. “నరేష్ గారి పుట్టినరోజు రోజు, బచ్చలమల్లి మీ అందరినీ పలకరిస్తాడు, హ్యాపీ బర్త్ డే చెప్పడానికి రెడీగా ఉండండి, స్పెషల్ బర్త్ డే గ్లింప్స్ రేపు ఉదయం 9 గంటలకు” అంటూ పోస్ట్ చేశారు. దీంతో పాటు వేరే లెవల్ పోస్టర్ ను రిలీజ్ చేశారు.ఆ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పోస్టర్ చూసి అంతా అల్లు అర్జున్ అనుకుంటున్నారు. పుష్ప రాజ్ అని ఏమో డౌట్ గా చూస్తున్నారు. అచ్చం బన్నీ లాగే అల్లరి నరేష్ ఉన్నారని అంటున్నారు. మొత్తానికి బచ్చలమల్లి సినిమా కోసం అల్లరి నరేష్ ఎలా మేకోవర్ చేసుకున్నారో క్లారిటీ వచ్చేసింది. గుబురు గడ్డం, జుట్టుతో ఊర మాస్ లుక్ లో ఆయన అదిరిపోయారని నెటిజన్లు చెబుతున్నారు. గ్లింప్స్ కూడా ఓ రేంజ్ లో ఉండనుందని అంటున్నారు.ఇక బచ్చలమల్లి సినిమాను హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరాం, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష తదితరులు నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో ఈ మూవీ షూటింగ్ జరుగుతోంది. మరి రేపు మేకర్స్ రిలీజ్ చేసే గ్లింప్స్ ఎలా ఉంటుందో చూడాలి.

## వారం రోజులకే ఆసుపత్రిలో సోనాక్షి!

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా- జహీర్ ఇక్బాల్ ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. కొన్నేళ్ల ప్రేమ బంధానికి పెద్దల్ని ఒప్పించి వివాహంతో ఫుల్ స్టాప్ పెట్టారు. దీంతో సోనాక్షి సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారం భమైంది. కెరీర్ పరంగా అమ్మడు ఎలా ముందుకు సాగుతుంది? మునుపటిలా అదే దూకుడుతో కొనసా గుతుందా? ఏవైనా మార్పులు చేస్తుందా? అన్నది చూడాలి. అయితే తాజాగా సోనాక్షి సిన్హా ఆసుపత్రిలో కనిపించడం నెట్టింట చర్చనీయాశంగా మారింది. పెళ్లైన వారం రోజులకే సోనాక్షి భర్త ఇక్బాల్ తో ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో కనిపించింది. దీంతో నెట్టింట ఆసక్తికర చర్చకు తెర తీసినట్లు అయింది. సోనాక్షి గర్భం దాల్చిందా? రెగ్యులర్ చెకప్ లో భాగంగా వచ్చిందా? అంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఆ కాసేపటికే ఇదంతా తప్పుడు ప్రచారమని తేలింది. తండ్రి శత్రుఘ్న సిన్హా రెగ్యులర్ చెకప్ కోసమే భర్తతో కలిసి వచ్చిందని బాలీవుడ్ మీడియాలో వార్తలొ స్తున్నాయి. నేరుగా ఆమె డాక్టర్లు తండ్రి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని వెళ్లినట్లు సమాచారం. అలాగే ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉ ఒడమని డాడ్ కి చెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సోనాక్షి బాలీవుడ్ లో రెండు సినిమాలు చేస్తోంది. అందులో కాకుడా ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకుంది. జులై 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే 'నిక్తారాయ్ అండ్ ది బుక్ ఆఫ్ డార్క్ నెస్' అనే మరో సినిమా చేస్తుంది. సోనాక్షి సౌత్ లోనూ ఇప్పటికే లాంచ్ అయిన సంగతి తెలిసిందే. సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'లింగ' సినిమాలో నటించింది. కానీ ఆ సినిమా తర్వాత అమ్మడు మళ్లీ మరో సినిమా చేయలేదు.



## అందానికే మరో అందం....



## కల్కి.. ఇక్కడే కాదు.. హాలీవుడ్ వాళ్లు కూడా!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన కల్కి 2898 ఏడీ సినిమా ఎలాంటి విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై సీనియర్ ప్రొడ్యూసర్ అశ్వనీదత్ రూ.600 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో రూపొందించిన ఈ చిత్రం.. వేరే లెవెల్ లో రెస్పాన్స్ అందుకుంటోంది. నాగి టాలెంట్ కు అటు కామన్ ఆడియన్స్ తో పాటు ఇటు సెలబ్రిటీలు ఫిదా అయిపోయారు. మహానటి మూవీతో మంచి గుర్తింపు సంపాదించుకున్న నాగ్ అశ్విన్.. కల్కితో పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ దక్కించుకున్నారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా నాగి కోసం చర్చ నడుస్తోంది. ఆయన సూపర్ టాలెంట్ కు ఓ రేంజ్ లో ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమాకు సంబంధించి వచ్చిన ప్రతి రివ్యూలో నాగి టాలెంట్ ను అందరూ తప్పకుండా ప్రస్తావిస్తున్నారు. ఇండియన్ సినిమాను అందనంత ఎత్తుకు తీసుకెళ్లారని చెబుతున్నారు. కేవలం ఇండియాలోనే కాదు.. హాలీవుడ్ క్రిటిక్స్ కూడా కల్కి సినిమా కోసం మాట్లాడుకుంటున్నారు. నాగ్ అశ్విన్ టాలెంట్ ను ప్రశంసిస్తున్నారు. సాధారణంగా అతీంద్రియ శక్తులను, సైన్స్ ను కలపడం చాలా కష్టమని, ఒక్కోసారి మిస్ ఫైర్ అవుతుంటాయని హాలీవుడ్ క్రిటిక్స్ చెబుతున్నారు. కానీ దర్శకుడు నాగి బాగానే హ్యాండిల్ చేశారని అంటున్నారు. ఎక్కడ సైన్స్, ఎక్కడ హిస్టరీ చూపించాలో కరెక్ట్ గా డిసైడ్ చేశారని అభిప్రాయపడుతున్నారు. సినిమా కోసం నాగ్ అశ్విన్ చాలా స్మార్ట్ గా స్క్రిప్ట్ వర్క్ చేసుకున్నారని కొనియాడుతున్నారు. సైన్స్ ను, పురాణాలను కలిపి వేసి గందరగోళంగా అనిపించకుండా మూవీ తీశారని చెబుతున్నారు. కంప్లీట్ వర్క్ పెర్ఫెక్ట్ గా ఉందని అంటున్నారు. అనుకున్నదానికంటే సినిమా వేరే లెవల్ లో ఉందని కొనియాడుతున్నారు. హాలీవుడ్ లో ఒకే రకమైన కథలు చేస్తూ ఉంటారని, రెండు జోనర్లను మిక్స్ చేసి సినిమాలు తీయడం లేదని అభిప్రాయపడుతున్నారు. రెండు జోనర్లు కలిపితే చాలా ఫ్రెష్ గా ఉంటుందని చెబుతున్నారు. ఏదేమైనా పెద్ద సినిమాలు తీసేటప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని, అలాంటి టైమ్ లో కూడా నాగ్ అశ్విన్ సరైన రీతిలో హ్యాండిల్ చేశారని కొనియాడుతున్నారు. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె, కమల్ హాసన్ తో పాటు ఇతర నటీనటులు తమ పాత్రలకు జీవం పోశారని ప్రశంసిస్తున్నారు. మొత్తానికి ఓవరాల్ గా కల్కి మూవీ అదిరిపోయిందని అంటున్నారు.






## గర్భధారణ సమయంలో వారంలో ఎన్ని కిలోల బరువు పెరగాలో మీకు తెలుసా



మీ గర్భధారణ సమయంలో ఎన్ని కిలోల బరువు పెరగాలో మీకు తెలుసా? గరధారణ సమయంలో తల్లులు ఎన్ని కిలోల బరువు పెరగాలి అని వైద్యులు చార్ట్ చేస్తారు. అంటే, గరధారణ సమయంలో మరియు ప్రతి వారం మీ ఎత్తుకు అనుగుణంగా మీరు ఎంత బరువు పెరగాలి అని వైద్యులు మీకు చెప్తారు. మీ జీవితంలో ఒకసారి జరిగే అదుతేమైన సంఘటన. కొంతమంది గరధారణ సమయంలో బరువు పెరగడం గురించి ఆందోళన చెందుతారు. మీరు దాని గురించి చింతించకుండా బరువు పెరుగుతారు. కానీ బరువు పెరగడం నెమ్మదిగా మరియు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల కలిగేది. మీరు ఎల్లప్పుడూ మీ శరీరానికి అవసరమైన బరువును నిర్వహించాలి.మీరు 5 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడు 46 కిలోల కన్నా తక్కువ ఉంటే, మీరు ఒక నిర్దిష్ట బరువులో ఉన్నారు, మీరు 46 కిలోల కంటే ఎక్కువ, మీరు 60 కిలోల కంటే తక్కువ, మీరు సరైన బరువులో ఉన్నారు, మీరు 60 కిలోల కంటే ఎక్కువ, మీరు 66 కిలోల కంటే తక్కువ, మీరు కొద్దిగా అధిక బరువుతో ఉన్నారు, మీరు 68 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు చాలా ఊబకాయం కలిగి ఉన్నారని అర్థం.5.2 అడుగుల ఎత్తు 48 కిలోల కంటే తక్కువగా ఉన్నప్పుడు మీరు బరువు తక్కువగా ఉన్నారని చెబుతారు, మీరు 49 కిలోలకు పైగా ఉన్నప్పుడు మీరు 64 కిలోల లోపు ఉన్నప్పుడు సరైన బరువులో ఉంటారు, మీరు 65 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు 71 కిలోల లోపు ఉంటారు, మీరు కొంచెం అధిక బరువు ఉన్నప్పుడు మరియు 72 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు చాలా ఊబకాయం కలిగి ఉన్నారని అర్థం.మీరు 5.4 అడుగుల ఎత్తు ఉన్నప్పుడు ఎత్తు బరువు కిలోల కంటే తక్కువగా ఉన్నప్పుడు, మీరు బరువు తక్కువగా ఉన్నారని చెబుతారు, మీరు 53 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు 68 కిలోల లోపు ఉన్నారు,ఉన్నప్పుడు మీరు 77 కిలోల లోపు ఉన్నప్పుడు మరియు మీరు 78 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు కొంచెం అధిక బరువు కలిగి ఉంటారు మీరు చాలా ఊబకాయం కలిగి ఉన్నారని అర్థం.ఎత్తు 5.6 అడుగులు ఉన్నప్పుడు అది 55 కిలోల కన్నా తక్కువ, మీరు నిర్దిష్ట బరువులో ఉన్నారు, మీరు 56 కిలోల కంటే ఎక్కువ, మీరు 73 కిలోల లోపు ఉన్నారు, మీరు సరైన బరువులో ఉన్నారు, మీరు 74 కిలోల కంటే ఎక్కువ, మీరు 81 కిలోల కంటే తక్కువ, మీరు కొంచెం అధిక బరువుతో ఉన్నారు, మీరు 82 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు ఎక్కువ ఊబకాయం కలిగి ఉన్నారని అర్థం.ఎత్తు 5.10 అడుగులు ఉన్నప్పుడు మీరు నిర్దిష్ట బరువులో ఉంటే 62 కిలోల లోపు, మీరు 63 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు 82 కిలోల లోపు మీరు సరైన బరువులో ఉన్నారు, మీరు 83 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు 91 కిలోల కంటే తక్కువ వయస్సులో ఉన్నారు మరియు మీరు 92 కిలోల కంటే ఎక్కువ ఉన్నప్పుడు మీరు ఎక్కువ ఊబకాయం కలిగి ఉన్నారని అర్థం.మీ గరధారణకు ముందు మీరు ఎన్ని కిలోల బరువు ఉండాలి అని మీరు చూశారు. కానీ గరధారణ 40 వారాలలో మీరు ఎన్ని కిలోలు పొందాలో కూడా తెలుసుకోండి. గరధారణకు ముందు బరువు తక్కువగా ఉన్న 40 వారాల్లో మీరు 12 కిలోల నుండి 18 కిలోల వరకు ఉండాలి.

మీకు సరైన బరువు ఉంటే 11 కిలోల నుండి 15 కిలోల వరకు బరువు పెరగాలి. పేర్కొన్న బరువును మించి ఉంటే 6 నుండి 11 కిలోల బరువు పెరుగుతుంది. మరియు కొద్దిగా అధిక బరువు ఉన్నవారికి, 4 నుండి 9 కిలోల బరువు పెరగడం సరిపోతుంది.

## జయహో భారత్.. రెండో సారి టీ20 ప్రపంచకప్ ముద్దాడిన టీమ్ఇండియా



టీ20 ప్రపంచకప్ మనదే.. రెండోసారి విశ్వవిజేత
17 ఏండ్ల తర్వాత భారత్‌కు టీ20 ప్రపంచకప్
ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఉత్కంఠ విజయం
కోహ్లీ, హార్దిక్ పాండ్యా విజృంభణ
క్లాసెన్, డికాక్ పోరాటం వృథా
సూర్యకుమార్‌యాదవ్ సంచలన క్యాచ్
మరోమారు సఫారీలకు నిరాశ
సంబురాల్లో యావత్ దేశం
ప్రముఖుల ప్రశంసల వెల్లువ
టీ 20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్‌కోహ్లీ

బ్రిడ్జ్‌టౌన్: భారత్ చిరకాల కల నెరవేరింది! అందినట్లే అంది చేజారుతూ వస్తున్న ప్రపంచకప్ ఎట్టకేలకు మన చెంతకు చేరింది. శనివారం ఆఖరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన టీ20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా ఏడు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై చిరస్మరణీయ విజయం సాధించింది. తొలుత విరాట్ కోహ్లీ(59 బంతుల్లో 76, 6ఫోర్లు, 2సిక్స్‌లు), అక్షర్‌పటేల్(31 బంతుల్లో 47, ఫోర్, 4సిక్స్‌లు) బ్యాటింగ్‌తో భారత్ తొలుత 20 ఓవర్లలో 176/7 స్కోరు చేసింది. మహారాజ్, నోకియా రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 169/8 స్కోరు చేసింది. క్లాసెన్(27 బంతుల్లో 52, 2ఫోర్లు, 5సిక్స్‌లు), డికాక్(39) రాణించారు. హార్దిక్‌పాండ్యా(3/20) మూడు వికెట్లతో విజృంభించగా, అర్షదీప్‌సింగ్(2/20), బుమ్రా(2/18) రెండేసి వికెట్లతో సత్తాచాటారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 15 వికెట్లతో అదరగొట్టిన బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' గా నిలిచాడు.తొలుత టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకున్నది. మెగాటోర్నీలో ఫామ్‌లేమితో సతమతమైన విరాట్ కోహ్లీ ఫైనల్ పోరులో సత్తాచాటాడు. జాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మూడు ఫోర్లు బాది తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్..టీమ్ఇండియాను ఆదిలోనే దెబ్బకొట్టాడు. వరుసగా రెండు ఫోర్లతో జోరు మీద కనిపించిన కెప్టెన్ రోహిత్‌శర్మ(9)తో పాటు వికెట్‌కీపర్, బ్యాటర్ పంత్(0)ను వెంటవెంటనే ఔట్ చేసి సఫారీ శిబిరంలో ఆనందం నింపాడు. తొలి రెండు ఓవర్లు ముగిసే సరికి టీమ్ఇండియా రెండు కీలక వికెట్లు కోల్పోయి 23 పరుగులు చేసింది. అప్పటికే కష్టాల్లో ఉన్న ఇండియాను రబాడ మరింత ఇబ్బందుల్లోకి నెట్టాడు.భారీ షాట్ ఆడబోయిన 'మిస్టర్ 360' సూర్యకుమార్(3)..క్లాసెన్ క్యాచ్‌తో మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. 34 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన తరుణంలో బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందువచ్చిన అక్షర్‌పటేల్..కోహ్లీకి జతకలిశాడు. ఇక్కణ్నుంచి టీమ్ఇండియా ఇన్నింగ్స్ గాడిలో పడింది. వీరిద్దరు సఫారీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పవర్‌ప్లే ముగేసి సరికి భారత్ 3 వికెట్లకు 45 పరుగులు చేసింది.ఓవైపు సహచరులు నిష్క్రమించినా..కోహ్లీ పరిణతి కనబరిచాడు. ఇన్నింగ్స్ గాడిలో పడి ఊపందుకుంటున్న తరుణంలో అనవసర పరుగు కోసం ప్రయత్నించిన అక్షర్.. కీపర్ డికాక్ డైరెక్ట్ త్రోతో భారంగా పెవిలియన్‌కు వెళ్లాడు. దీంతో నాలుగో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే(27) అడపాదడపా భారీ షాట్లు ఆడే ప్రయత్నం చేశాడు. హాఫ్ సెంచరీ తర్వాత బ్యాటు ఝులిపించిన విరాట్..రబాడ 18వ ఓవర్లో ఓ భారీ సిక్స్, ఫోర్‌తో ఆకట్టుకున్నాడు. అదే ఊపులో జాన్సెన్‌ను అరుసుకుంటూ 19వ ఓవర్లో కోహ్లీ 4, 6 జోరు కనబరిచాడు. మరో భారీ షాట్ ఆడే క్రమంలో బౌండరీ వద్ద రబాడ క్యాచ్‌తో కోహ్లీ ఔట్ కావడంతో ఐదో వికెట్‌కు 57 పరుగుల పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. 20వ ఓవర్ వేసిన నోకియా..దూబే, జడేజా(2)ను ఔట్ చేసి తొమ్మిది పరుగులే ఇచ్చుకోవడంతో టీమ్ఇండియా 7 వికెట్లకు 176 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌కు తెరపడింది.భారత్ నిర్దేశించిన లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా సరైన శుభారంభం దక్కలేదు. 12 పరుగులకే ఓపెనర్ హెండ్రిక్స్(4), కెప్టెన్ మార్క్మ్(?ర4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఓవైపు సహచరులు నిష్క్రమించినా..డికాక్ పోరాటాన్ని నమ్ముకున్నాడు. ఈ తరుణంలో కెప్టెన్ రోహిత్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. ఇంగ్లండ్‌తో గత మ్యాచ్‌లో విజృంభించిన స్పిన్నర్లు అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్ ఈ మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయారు. 13వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన డికాక్..కుల్దీప్ క్యాచ్‌తో ఔటయ్యాడు. ఆ తర్వాత క్లాసెన్ విశ్వరూపం ప్రదర్శించాడు. అక్షర్ పటేల్ వేసిన 15వ ఓవర్‌లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో ఏకంగా 24 ఫోర్లతో దుమ్మురేపాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.